క్లుప్తంగా

జంగం దేవర్లకు దుస్తులు, పండ్లు పంపిణీ



జంగందేవర్లకు దుస్తులు, పండ్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

దెందులూరు: సంక్రాంతి పండుగ ముగిసిన సందర్భంగా నెలరోజులు దెందులూరులో పరిధిలోని 16 మంది జంగందేవర్లకు తన తండ్రి సుగ్గిశెట్టి సత్యనారాయణ పేరిట దుస్తులు, పండ్లు అందించామని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు తెలిపారు. శుక్రవారం నర్సింగ్ కళాశాలలో 16 మంది జంగందేవర్లకు దుస్తులు, పండ్లు పంపిణీ చేసి సత్కరించారు.

చౌక డిపో డీలర్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో ఖాళీగా ఉన్న 6 చౌక డిపో డీలర్ల నియామకం కోసం దరకాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దారు పూర్ణచంద్రప్రసాద్ తెలిపారు. ఉంగుటూరు ఎస్సీ, యర్రమళ్ల బీసీ (డి) మహిళ, బాదంపూడి బీసీ (బి), దొంతవరం బీసీ (ఎ), వీకే పురం ఎస్సీ, తిమ్మయ్యపాలెం బీసీ (ఇ), రిజర్వేషన్లు కేటాయించామని తెలిపారు. ఈ రిజర్వేషన్లను అనుసరించి దరకాస్తు చేసుకోవాలని తహసీల్దారు సూచించారు. దరకాస్తులను ఏలూరు ఆర్డీవో కార్యాలయంలో, ఉంగుటూరు తహసీల్దారు కార్యాలయంలో దరకాస్తులు అందజేయాలని ఆయన కోరారు.

చిల్డ్రన్ హోమ్‌లో అన్నదానం



చిన్నారులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

దెందులూరు: అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మహాదానమని, చిన్నారులకు అన్నదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, పోతునూరు ఎంపీటీసీ నున్నా నరేష్, గుంటూరు పోలీస్ కానిస్టేబుల్ సుమన్ అన్నారు. శుక్రవారం విహాన్ చారిటబుల్ ట్రస్ట్ చిల్డ్రన్ హోమ్‌లో చిన్నారులకు తన తండ్రి పేరిట కుటుంబ సమేతంగా అన్నదానం నిర్వహించారు.

రోడ్డు నిర్మాణానికి కృషి

దెందులూరు: దెందులూరులో నూతన సాల్వేషన్ ఆర్మీ చర్చికి వెళ్లేందుకు రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని సర్పంచ్ తోట ఏసమ్మ అన్నారు. శుక్రవారం దెందులూరు సాల్వేషన్ ఆర్మీ చర్చి స్థలదాత కుటుంబ సభ్యులు పల్లె శామ్యూల్, గాంధీ, యుగంధర్, హర్షవర్ధన్ కోర్ ఆఫీసర్ మేజర్ రమణయ్య, సంఘస్తులు, సర్పంచ్‌కు రోడ్డు ఆవశ్యకతను వివరించారు. అనంతరం హర్షవర్ధన్ బెతస్థ గాస్పల్ చర్చ్ దైవజనులు పాస్టర్ విశాల్ కుటుంబ సభ్యులు సర్పంచిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ కల్నల్ జోషి, పాస్టర్ ప్రసాద్, సంఘ పెద్దలు, సంఘస్తులు, గౌడ సంఘ సభ్యులు ఉన్నారు.

12 కేసులు, 34 మంది అరెస్ట్

దెందులూరు: మండలంలో మూడు రోజులుగా నిర్వహించిన కోడిపందేలు, పేకాటలో 12 కేసులు నమోదు చేశామని దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ అన్నారు. దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ 12 కేసుల్లో 34 మందిని అరెస్ట్ చేశామన్నారు. మరికొన్ని కేసుల్లో 54 మందిని దెందులూరు మండల తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేశామన్నారు.

25 మంది జూదరుల అరెస్టు

ఉంగుటూరు: సంక్రాంతి సందర్భంగా పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. నారాయణపురం టూరింగు పేటలో పేకాట స్థావరంపై దాడి చేసి 19 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మామిడాల సూర్యభగవాన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,66,020 స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. కంసాలి గుంటలో కోడి పందేలు ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని రెండు కోడిపుంజులు, రెండు కత్తులు, రూ.7వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

ఉపాధి పనులు చేపట్టాలి

భీమడోలు: దాళ్వా సీజన్ ముగిసినందున ఉపాధి హామీ పనులు ప్రారంభించి కూలీలకు పనులు కల్పించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు శుక్రవారం భీమడోలు మాజీ ఏఎంసీ చైర్మన్ వగ్వాల భాస్కర్ వినతిపత్రం అందించారు. గుండుగొలను గ్రామ సభలో నిర్ణయించిన పనులను ఉపాధి హామీ పథకం అధికారులు చేపట్టాలని, ఉపాధి హామీ కూలికి వంద రోజుల పనిని సక్రమంగా చేపట్టాలని, కూలీ ఖాతాల్లోనే నగదును జమ చేయాలని కోరారు. గ్రామంలో క్షేత్ర సహాయకులు లేనందున పనులు చేపట్టేందుకు ఇన్‌చార్జి ఫీల్డ్ అసిస్టెంట్‌తో నిర్దేశించిన పనులను చేయించాలని కోరారు. గతేడాది జూన్‌లో చేసిన ఉపాధి కూలీల్లో కొంత మందికి నేటికీ నగదు జమ కాలేదన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఆ శాఖ పీడీ, ఎంపీడీవోలు, పంచాయతీ అధికారులకు వినతిపత్రాలను అందించినట్లు ఆయన తెలిపారు.

ఆక్రమణల తొలగింపునకు అడ్డంకులు

- స్టే ఉత్తర్వులతో తాత్కాలికంగా బ్రేక్
- సందిగ్ధావస్థలో ఆక్రమణదారులు



ఉంగుటూరు-నారాయణపురం మధ్య ఆక్రమణలు తొలగించిన దృశ్యం



నారాయణపురంలో స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించిన దుకాణదారులు

ఉంగుటూరు: ఏలూరు కాలువ గట్టుపై ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలులో ఆక్రమణల తొలగింపునకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ఇటీవల కోర్టు నుంచి స్టే ఆర్డరు రావడంతో ఆక్రమణల తొలగింపు పనులు తాత్కాలికంగా నిలిచాయి. హోటళ్ల వ్యర్థాలు, సర్వీసింగ్ సెంటర్లో వ్యర్థాలు, ఇళ్ల మరుగుదొడ్ల పైపులు కాలువలోకి పెట్టడంతో నీరు కలుషితమవుతోందని లోక్‌అదాలత్‌లో పిటిషన్ పర్యవసానంగా ఆక్రమణలు తొలగింపునకు జిల్లా, మండల అధికార్లు పూనుకున్నారు. పలు దఫాల సమావేశాలు నిర్వహించి, స్వచ్ఛందంగా ఆక్రమ కట్టడాలు తొలగించాలని ఆక్రమణదారులకు అధికారులు హుకుం జారీ చేయడంతోపాటు పంచాయతీ సెక్రటర్రీలు నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభు త్వ యంత్రాంగం జేసీబీలతో కాలువ గట్టుపై ఉన్న కొన్ని దూడల పాకలు, గడ్డిమేట్లను బాదంపూడి నుంచి తొలగింపుపనులు మొదలుపెట్టారు. ఈ లోపు ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలులో కొంతమంది ఆక్రమణదారులు ఆక్రమ కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించడంప్రారంభించారు. అయి తే ఆక్రమణదార్లులో కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో ఆక్రమణల తొలగింపుపై స్టే ఇచ్చింది. నివాసితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తేగాని తొలగించరాదని స్పష్టంచేసింది. ఈక్రమంలో ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాల పథకంలో లబ్ధిపొందనివారిని గుర్తించే ప్రక్రియను తహసీల్దారు ప్రసాదు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్నారు. కొందరయితే అక్రమ కట్టడాలను తీయనవసరం లేదులే అని భావిస్తున్నారు. ఎప్పటికైనా తీసేయడం తప్పదని కొందరు అనుకుంటున్నారు. ముందుగా కట్టడాలను తొలగించినవారు ఇప్పుడు అయోమయ పరిస్థితిలోఉన్నారు. ఇలా భిన్నాభిప్రాయాల చర్చల్లో ఆక్రమణదారులు తలమునకలై ఉన్నారు.

తొలగించడం అన్యాయం



ప్రభుత్వానికి ప్రస్తుతం అవసరం లేకపోయినా ఆక్రమణలు తొలగించడం అన్యాయం. ఆర్అండ్‌బీకి, ఇరిగేషన్ శాఖకు స్థలం అవసరంలేదు. అవసరమైతే తీసుకున్నా పరవాలేదు. కావాలని కట్టడాలను తొలగిస్తున్నారు. 50 ఏళ్లుగా నివాసం ఉంటున్న వారు ఎక్కడికి వెళతారు.

– నక్కిరి పెద్దిరాజు, ఆక్రమణదారుడు, చేబ్రోలు

చిరు వ్యాపారంతో జీవనం



కొబ్బరి కాయలు, అరటిపండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాను. 50 ఏళ్ల పైబడి ఈకాలువగట్టు వద్దనే చిరు వ్యాపా రంచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. షాపు తొలగించాలని అధికారులు నోటీసులిచ్చారు. 65 ఏళ్ల వయ స్సులో ఇప్పుడు ఎక్కడికి వెళ్లేది. ప్రభుత్వమే ఆలోచించి న్యాయం చేయాలి.

– కాళ్లపు రత్నకుమారి, చిరు వ్యాపారి చేబ్రోలు

ఆక్రమణలు తొలగించక తప్పదు

గోదవారి ఏలూరు కాలవగట్టుపై ఆక్రమణలు తొలగించక తప్పదు. ఆక్రమణదారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తొలగించాలని మాత్రమే కోర్టు స్టే ఇచ్చింది. దీని ప్రకారం ఇంతకముందు ఎవరెవరు లబ్ధి పొందారు, ఎవరు ఇళ్ల స్థలాలు తీసుకున్నది వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీల ద్వారా జాబితాలు తయారు చేస్తున్నాం. అనంతరం ఆక్రమణలను తొలగిస్తాం.

– పూర్ణ చంద్రప్రసాదు, తహసీల్దారు, ఉంగుటూరు

అందరూ అక్షరాస్యులు కావాలి



గణపవరం ఐకేపీ కార్యాలయంలో వీవోఏలకు శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో శ్రీలక్ష్మి

గణపవరం: నిరక్ష్యరాస్యులందరినీ అక్షరాస్యులుగా మార్చడానికి అమలు చేస్తున్న ఉల్లాస్ కార్యక్రమం విజయవంతం చేయడానికి వీవోఏలంతా అంకిత భావంతో పనిచేయాలని గణపవరం ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం గణపవరం ఐకేపీ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమం నిర్వహణపై వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మండలంలో ఉన్న నిరక్ష్యరాస్యులైన వయోజనులందరికీ ఉల్లాస్ కార్యక్రమంలో సాంకేతిక విద్య, క్రియాత్మక విద్య, ఆర్థిక విద్య అభ్యాసకులందరికీ నేర్పించేందుకు మండలంలోని వీవోఏలందరినీ వలంటీర్లుగా కలెక్టరు ఆదేశాలమేరకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీవోఏలంతా ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి నిరక్ష్యరాస్యులైన వయోజనులందరికీ ఉపయోగపడేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది వీవోఏలకు అక్షర వెలుగు పుస్తకాలు, సంక్షిప్త వాచకాలు పంపిణీ చేశారు. ఏపీఎం ఎస్ఎస్ అమీరున్నీసా, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక, సంగీత, నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి నిత్య కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తిరిగి సాయంకాల పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు నగరానికి చెందిన మద్దూరి వెంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ శ్రీ అంబరీషోపాఖ్యానం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి 7.30 గంటలకు నగరానికి చెందిన దివ్య సుహాసిని శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అర్చకులు కిశాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్యార్థుల భవితకు నవోదయం

- ఉన్నత ప్రమాణాలకు, నాణ్యమైన విద్యకు వేదిక
- నేడు నవోదయ ప్రవేశ పరీక్ష
- ఉదయం 11.30 నుంచి రూ.1.30 గంటలకు వరకు నిర్వహణ



పెదవేగి నవోదయలో శారీరక వ్యాయామంలో భాగంగా క్రీడలు ఆడుతున్న విద్యార్థులు



భీమడోలు పరీక్షా కేంద్రంలో హాల్ టికెట్ల నంబర్లు వేస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ సాయిబాబు

భీమడోలు: ప్రతిభ గల గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు జవహర్ నవోదయ విద్యాలయాలు వేదికలుగా మారాయి. ఈ పాఠశాలలో సీటు వస్తే లక్ష్యాన్ని చేరుకోవడం సులువు కానుంది. ఎందరో ఈ పాఠశాలల్లో చదువుకుని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకుని పలువురికి ఆదర్శంగా నిలిచారు. నవోదయలో సీటు కోసం కొన్ని నెలలుగా విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. వారి కలను సాకారం చేసుకునే సమయం ఆసన్నమైంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ గల విద్యార్థులను గుర్తించి, వారి కుటుంబ సామాజిక ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ప్రతిభ ఆధారంగా ఉత్తమ రెసిడెన్షియల్ పాఠశాల విద్యను అందించడమే జవహర్ నవోదయ పాఠశాలల లక్ష్యం. నవోదయలో సీటు వస్తే ఏడేళ్ల పాటు ఉచితంగా నాణ్యమైన విద్యనభ్యసించవచ్చు. విద్యా ప్రమాణాలతో కూడిన విద్యాబోధన, క్రీడలు, సాహస కృత్యాలు, చక్కని పోష్టికాహారంతో పాటు వివిధ రంగాల్లో అధునాతన శిక్షణకు నవోదయాలు కేంద్రాలుగా మారాయి. వీటిలో చేరేందుకు ఏటా వేలాది మంది విద్యార్థులు పోటీ పడుతుండగా, ఒక్కసారి ఆరవ తరగతిలో ప్రవేశం పొందితే వారంతా ఇంటర్ వరకు విలువలతో కూడిన ఉచిత విద్య అందుతుంది. నవోదయ పరీక్షకు ఈనెల 18వ తేదీ శనివారం దేశ వ్యాప్తంగా జరగనుంది. భీమడోలు మండలంలో భీమడోలు, శ్రీచైతన్య పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసారు. వాటిలో భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు మండలాలకు చెందిన 532 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారు. దీనికి సంబంధించి 25 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. విద్యార్థుల హాల్ టికెట్ల వారీగా సీట్లు కేటాయించారు.

ప్రయోజనాలు : ప్రతిభ గల గ్రామీణ విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నాయి. విలువలతో కూడిన విద్య, శారీరక విద్యను పెంపొందించుకోవడం, ప్రతికూలతను ఎదుర్కోకుండా పోటీతత్వాన్ని అలవర్చుతారు. సీటు పొందిన వారికి ఉచితంగా వసతి, భోజన సదుపాయాలు, యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, స్టేషనరీలను అందిస్తారు.

ప్రవేశ పరీక్షకు 5,642 మంది విద్యార్థులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పెదవేగి జవహర్ నవోదయ పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో చేరేందుకు 80 సీట్లు మాత్రమే ఉంటాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా 26 పరీక్షా కేంద్రాల్లో 5,642 మంది పరీక్ష రానున్నాయని అధికారులు తెలిపారు.

80 ప్రశ్నలు... 100 మార్కులు

పరీక్ష పేపర్‌లో 80 ప్రశ్నలకు వంద మార్కులు కేటాయిస్తారు. ఒక్కొక్క ప్రశ్నకు 1.25 మార్కుల చొప్పున కేటాయిస్తారు. గణిత సబ్జెక్టులో 40 ప్రశ్నలకు 50 మార్కులు, మెంటల్ ఎబిలిటీకి 20 ప్రశ్నలకు 25 మార్కులు, భాషా పరిజ్ఞానానికి 20 ప్రశ్నలకు 25 మార్కులు కేటాయిస్తారు. శనివారం నిర్వహించనున్న నవోదయ పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు జరుగుతుంది. పరీక్ష హాల్లోకి విద్యార్థులను 10.45 గంటలకు అనుమతిస్తారు. ఆలస్యంగా కేంద్రానికి వస్తే పరీక్ష రాసేందుకు అనుమతి ఉండదు. విద్యార్థుల తమ వెంట హాల్ టికెట్లతో పాటు గుర్తింపు కార్డు, బ్లూ లేదా బ్లాక్ పెన్నుతో పరీక్ష రాయాలి. పరీక్షా కేంద్రం లోపలకు ఎల్రక్టానిక్ పరికరాలను తీసుకుని వెళ్లరాదు. విద్యార్థులు పాఠశాల యూనిఫామ్, సివిల్ డ్రెస్ వేసుకుని హాజరుకావచ్చు.

పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



భీమడోలులో 240 మంది, చైతన్య పాఠశాలలో 292 మంది నవోదయ పరీక్ష రాయనున్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు అవసరమైన ఇన్విజిలేటర్లను నియమించాం. చీఫ్ సూపరింటెండెంట్లకు శిక్షణనిచ్చాం. ఉదయం 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకు పరీక్షను పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసాం.

– ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎంఈవో, భీమడోలు

గోకులం.. పాడి రైతుల్లో నైరాశ్యం

- అమలుకు అడ్డంకిగా మారిన నిబంధనలు
- షెడ్ల నిర్మాణం పూర్తయ్యాకే నిధుల విడుదల
- ముందుకు రాని రైతులు



మాదేపల్లిలో కౌలురైతు పంట కాలువ పక్కన కట్టిన పశువులు

ఏలూరు రూరల్ : గోకులం పథకం పాడి రైతులకు అందని ద్రాక్షగా మారింది. షెడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలం ఉండాలన్న నిబంధనతో రైతులు అనర్హులుగా మిగులుతున్నారు. షెడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాతే నిధులు మంజూరు కావడం లేదు. ఫలితంగా ఏలూరు రూరల్ మండలంలో మంజూరైన 10 యూనిట్లలో ఇప్పటివరకు కనీసం 5 కూడా పూర్తి కాలేదు.

కౌలు రైతులకు వర్తించని వైనం : ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో 6,500 ఎకరాల్లో వరి సాగవుతుంది. ఇందులో 75 శాతం భూమి కౌలుదారులే సాగు చేస్తున్నారు. వరి సాగుతో పాటు పశువులను మేపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. భూ యజమానికి నుంచి కౌలుకు తీసుకున్న చేలు, పంట బోదె, పోరంబోకు స్థలాల్లో పశువులను కట్టి మేపుకుంటున్నారు. పంట కోసిన తర్వాత వచ్చిన ఎండి గడ్డి, ఖరీఫ్, రబీ సాగుకు ముందు చేలు, గట్లపై మొలిచిన పచ్చగడ్డిని పశువులకు దాణాగా వినియోగిస్తున్నారు. వీరికి సొంత స్థలం లేకపోవడంతో కౌలు చేస్తున్న భూమి సర్వే నెంబర్ పేర్కొని పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు భూ యజమానులు ఒప్పుకోవడం లేదు. దీంతో పాడి పరిశ్రమపై ఆధారపడ్డ కౌలు రైతులకు గోకులం వర్తించడంలేదు. భూమి ఉన్న రైతులు పాత షెడ్లను తొలగించి, ప్రభుత్వం ఇచ్చే 90 శాతం నిధులతో కొత్త షెడ్లను నిర్మించుకుంటున్నారు.

లబ్ధిదారుడి వాటా 10 శాతం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం గోకులం పథకం అమలు చేస్తోంది. గోకులం షెడ్డు నిర్మాణానికయ్యే మొత్తం ఖర్చులో లబ్ధిదారుడు 10 శాతం, ప్రభుత్వం 90 శాతం భరిస్తుంది. అంటే రూ.లక్షకు రూ.10 వేలు లబ్ధిదారుడు భరిస్తే, మిగిలిన రూ.90 వేలు ప్రభుత్వం అందిస్తుంది.

చేతులెత్తేస్తున్న అర్హులు

గత టీడీపీ హయాంలో గోకులం షెడ్లు కట్టకుండానే పార్టీ నాయకులు, కార్యకర్తలు నిధులు కాజేసినట్లు తేలింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ హయాంలో గోకులంపథకాన్ని రద్దు చేసింది. తాజాగా కూటమి ప్రభుత్వం గోకులం పథకం ఆచరణలో పెట్టింది. అయితే షెడ్ల నిర్మాణంలో జియో ట్యాగింగ్ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిబంధన టీడీపీ సానుభూతిపరులకు అడ్డంకిగా మారింది. షెడ్డు కట్టకుండా నిధులు కాజేయాలన్న పాచిక పారడం లేదు. జూలిపూడి, కాట్లంపూడి తదితర గ్రామాల్లో అర్హత ఉన్న రైతులు గోకులం పథకం వద్దంటూ చేతులెత్తేశారు.

నిబంధనలు పాటించాలి

గోకులం పథకంలో ప్రభుత్వం పేర్కొన్న నిబంధనలు పాటించాల్సిందే. షెడ్డు పక్కాగా కట్టిన వారికే నిధులు మంజూరవుతాయి. ఈ పనులన్నీ ఎంఎస్ఆర్ఈజీఎస్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తారు. ఏలూరు రూరల్ మండలానికి 10 యూనిట్లు మంజూరయ్యాయి. ఈ యూనిట్లు మాదేపల్లి, కాట్లంపూడి, జాలిపూడి, చాటపర్రు, మల్కాపురం గ్రామాలకు కేటాయించాం. స్థలం ఉందా లేదా అని పరిశీలించే షెడ్లు మంజూరు చేశాం.

– ఎం లక్ష్మి, చాటపర్రు పశువైద్యురాలు

365 ఎకరాల పంట భూములకు సాగునీరు

దెందులూరు : సానిగూడెంలోని పెద్ద చెరువు ఆయకట్టు 360 ఎకరాల పంట భూమికి పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తున్నామని పెద్ద చెరువు నీటి సంఘం అధ్యక్షుడు సానిగూడెం మాజీ సర్పంచ్ యలమర్తి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెద్ద చెరువు పరిధిలో 364 ఎకరాల పంట భూమి ఉందని 125 మంది రైతులు సాగు చేస్తున్నారన్నారు. తూరలకు మరమ్మతులు, కాలువ పనులు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దాదాపు కోటి రూపాయలతో పెద్ద చెరువు ఆయకట్టు సాగు అభివృద్ధి పనులు నిధులు మంజూరైన వెంటనే పనుల ప్రారంభిస్తామని ఆయకట్టు పరిధిలో ప్రతి రైతు సాగునీరు సమస్య పరిష్కారానికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని అధ్యక్షుడు యలమర్తి శ్రీనివాసరావు అన్నారు.

డ్రైవర్లకు వేతనాలు చెల్లించాలి



పదోన్నతి పత్రాలు అందజేసినప్పటి ఫొటోలను చూపుతున్న డ్రైవర్లు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర పాలక సంస్థ ప్రజారోగ్య శాఖ, ఇంజినీరింగ్ శాఖలో పని చేస్తూ హెవీ వెహికల్ డ్రైవర్లుగా పదోన్నతి పొందిన వారికి పదోన్నతి వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2022 మార్చి 30న నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖలో పనిచేస్తున్న 8 మంది, ఇంజినీరింగ్ శాఖలో పనిచేస్తున్న ఒకరికి హెవీ వెహికల్స్ డ్రైవర్లుగా పదోన్నతి ఇచ్చిందన్నారు. నాటి నుంచి డ్రైవర్ల స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించకుండా, వర్కర్లకు చెల్లించే విధంగా వేతనాలే చెల్లిస్తోందని అన్నారు. వార్షిక, అడాక్ ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా 9 మంది డ్రైవర్లకు జీతభత్యాలలో రూ.లక్షల నష్టం కలిగించారని తెలిపారు. డ్రైవర్ల సమస్య పరిష్కారం కానిపక్షంలో ఫిబ్రవరి మొదటి వారం నుంచి ప్రత్యక్ష ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ నగరపాలక సంస్థ మేనేజ్మెంట్ వెంటనే స్పందించి పదోన్నతి పొందిన డ్రైవర్లకు వేతనం, వార్షిక, అడాక్ ఇంక్రిమెంట్లు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తాడేపల్లి శేఖర్, అంతర్వేది శేఖర్, ఏబీ ఆంథోనీ పాల్ తదితరులు పాల్గొన్నారు.

రక్షిత నీటి పథకాలపై సమీక్ష

ఉంగుటూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి రక్షిత మంచినీరు అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికార్లు ఏఈ, డీఈలతో ఎమ్మెల్యే ధర్మరాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో జల జీవన్ మిషన్‌లో మంజూరై రద్దయిన పనుల్లో అత్యవసరమైనవి గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నివేదిక ప్రకారం పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాటర్ గ్రిడ్ స్కీం ద్వారా నియోజకవర్గానికి రక్షిత తాగునీరు పూర్తిస్థాయిలో సరఫరాకు కొంతకాలం పట్టే అవకాశం ఉన్నందున ఈ లోపు తాగునీరు సరఫరాకు ఇబ్బంది ఉన్న గ్రామాలను, శిథిలావస్థకు చేరుకున్న మంచినీటి పైపు లైన్లు గుర్తించాలన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం అవసరమయ్యే వాటర్ ట్యాంకుల నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు తయారు చేసిన నివేదికను ఎమ్మెల్యేకు అందజేశారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

ఏలూరు టౌన్: వాతావరణంలో మార్పుల నేపథ్యంలో దగ్గు, జలుబు, ఆయాసం వంటి అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని, అశ్రద్ధ వహిస్తే ప్రాణాంతక బ్రాంకై టీస్, నియోనియా వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని ఏలూరు తాపీమేస్త్రీ కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయి నిఖిత అన్నారు. ఏలూరు టైటస్‌నగర్ ప్రాంతంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. అనారోగ్య సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యూపీహెచ్‌సీలో 63 రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, శీతాకాలంలో చలిగాలులు వీస్తోన్న పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. మలేరియా విభాగం అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటిని నిల్వల్లో దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాపింపజేస్తాయని వివరించారు. మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.